# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

<u>పత్రికా ప్రకటన</u>

ఏప్రిల్ 04, 2018

## ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం, 1989ను బలహీనపరిచే సుప్రీం కోర్టు నిర్ణయాన్నీ, ప్రభుత్వ దళిత-ఆదివాసీ వ్యతిరేక వైఖరినీ ఖండిద్దాం!

ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం, 1989ను నిర్వీర్యపరుస్తూ ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును, ఈ విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ దళిత–ఆదివాసీ వ్యతిరేక వైఖరిని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు), కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. అదే విధంగా ఈ తీర్పుకు వ్యతిరేకంగా దళిత సంఘాలు తలపెట్టిన భారత్ బంద్ సందర్భంగా జరిగిన పలువురి దళితుల హత్యలనూ, పాలకుల, పోలీసుల దళిత వ్యతిరేక పని విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. భారత న్యాయ వ్యవస్థ స్వతంత్రమూ, లౌకికమూ కాదనే విషయం దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు ద్వారా మరొకసారి స్పష్టంగా నిరూపితమయింది. అది బ్రాహ్మణీయ హిందుత్వ కులతత్వ రంగు పులుముకున్నది. దళిత–ఆదివాసీ ప్రతికూల చరిత్ర కలిగినది. కేంద్రంలో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు సంఘ్ పరివార్‌కు చెందిన బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండీ న్యాయ వ్యవస్థతో పాటు రాజ్య యంత్రాంగానికి సంబంధించిన అన్ని సంస్థలూ, వ్యవస్థలూ, సంస్థానాలతో పాటు విద్యా సంస్థల కాషాయీకరణ వేగంగా పెరుగుతున్నది. పాలకుల, ప్రభుత్వాధికారుల, పోలీసు, సైన్య ప్రత్యక్ష సంరక్షణ, మద్దతు, పోషణలో ఈ క్రమం నిరాటంకంగా కొనసాగుతున్నది. ఇందులో భాగమే, ఇటీవలి సుప్రీం కోర్టు తీర్పు, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ దళిత, ఆదివాసీ వ్యతిరేక వైఖరి.

దేశంలో దళితులనూ, ఆదివాసులను దళితేతరులూ, ప్రత్యేకించి అగ్ర కుల దురహంకారులు చులకన చేయడం, నీచ దృష్టితో చూడడం, కులం పేరుతో దూషించడం, వాళ్లపై అత్యాచారాలకు పాల్పడడం వంటి చర్యలకు వ్యతిరేకంగా ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం, 1989 రూపొందించబడింది. శతాబ్దాల తరబడి బ్రాహ్మణీయ హిందుత్వ మనువాద కుల వ్యవస్థ కాటును భరిస్తున్న దళిత, ఆదివాసులకు ఇది కేవలం కంటితుడుపు చట్టమే. దీని అమలు కూడా నామమాత్రమే. ఇక కులతత్వాన్ని రూపుమాపడం, అందరికీ సమానత్వాన్ని కల్పించడం అనేదానితో ఈ చట్టానికి ఎటువంటి సంబంధమూ లేదు. అయినప్పటికీ కరడుకట్టిన హిందూ మతోన్మాదులకు ఈ చట్టం కంటగింపుగా వుంది. అందుకనే బీజేపీ ప్రభుత్వ హయాంలో దీనికి వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో అర్జీ దాఖలయింది. ఈ కేసులో భారత ప్రభుత్వం ఒక పార్టీగా వుంది. అది కావాలనే తన వైపు నుండి చట్టాన్ని సమర్థిస్తూ బలమైన వాదన వినిపించలేదు. పైగా ఈ చట్టం ప్రకారం నిందితుడు ముందస్తు బెయిల్ పొందడానికి కేంద్రానికి ఎటువంటి అభ్యంతరం లేదని తన అడిషనల్ సొలిసిటర్ జనరల్ వేణుగోపాల్ ద్వారా సిఫార్స్ చేయించింది. ప్రస్తుత ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని మరింత బలహీనపరచడానికి, అగ్ర కుల ఆధిపత్యాన్ని యథాతథంగా నిలిపి వుంచడానికి ప్రభుత్వం పకడ్బందీగా పన్నిన పథకమిది. సుప్రీం కోర్టు తన దళిత, ఆదివాసీ వ్యతిరేక తీర్పులో ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రొవిజన్స్‌ను బలహీనపరుస్తూ దోషిని వెంటనే అరెస్టు చేయకుండా వుండే, ముందస్తు బెయిల్‌ను పొందే, ఏడు రోజుల్లో ఎంక్వైరీని పూర్తి చేసే ఏర్పాటును కల్పించింది.

సుప్రీం కోర్టు తీర్పుపై దేశవ్యాప్తంగా వచ్చిన వ్యతిరేకత, భారత్ బంద్ సందర్భంలో పెద్ద ఎత్తున చెలరేగిన హింస, దళితులు హత్య... మొత్తంగా పదిరోజులు గడిచిన తర్వాత పునర్విచారణ కోసం ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. ప్రతిగా సుప్రీం కోర్టు తన నిర్ణయంపై స్టే ఆర్డర్ ఇవ్వడానికి తిరస్కరించింది. ఇది సుప్రీం కోర్టు అవలంబిస్తున్న అగ్రకులతత్వ మొండి వైఖరికి నిదర్శనం. ఈ మొత్తం కాలంలో ప్రధాని మౌనం సారించడాన్ని బట్టి ఇదంతా పకడ్బందీగా జరుగుతున్నదని తెలుస్తున్నది.

వాస్తవానికి దళితులపై జరుగుతున్న అత్యాచారాలను ఆపడంలో ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం మొదటి నుండి అసమగ్ర, అసమర్థ, అసహాయ చట్టంగా మాటి మాటికీ నిరూపితమవుతున్నది. దీని అమలు పట్ల రాజ్య యంత్రాంగంలోని మూడు విభాగాలూ – శాసన, కార్యనిర్వాహక, నాయ వ్యవస్థలు కావాలనే ఒకే రీతిగా నేరపూరిత నిర్లక్ష్యాన్ని వహిస్తున్నాయి. దళిత, ఆదివాసీ ఉద్యమాలకు తలవొంచి శాసన వ్యవస్థ చట్టాన్నయితే తయారు చేసింది. కానీ దాని అమలుపై నీళ్లు చల్లే విషయంలో పార్లమెంటరీ పార్టీలన్నింటి వైఖరి ఒకే విధంగా వుంది. దీని ప్రకారం కేసు నమోదు చేయడమనేది పోలీసులకు తలనొప్పి వ్యవహారమని ఒకరంటే, దీన్ని మార్చాలనీ, రద్దు చేయాలని మరొకరు వాదిస్తారు. గతంలో సమాజ్‌వాది పార్టీ నాయకుడు ములాయం సింగ్ ఎస్సీ, ఎస్టీ చట్టానికి వ్యతిరేకంగా నిస్సిగ్గుగా బహిరంగ ప్రకటన చేశాడు. 1997లో ఉత్తర ప్రదేశ్‌లో బీజేపీ ఈ చట్టాన్ని రద్దు చేయాలని మాట్లాడింది. ఆఖరికి అప్పటి ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి మాయావతి కూడా మారుతున్న రాజకీయ సమీకరణాలూ, అగ్ర కులాలూ, అగ్ర వర్గాలకు చెందిన వారితో స్వార్థ పూరిత పొత్తుల కారణంగా కలెక్టర్ల ఆమోదం లేకుండా ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయకూడదని పోలీసులను ఆదేశించింది. పశ్చిమ బెంగాల్‌లోని నాటి సీపీఐ(ఎం) ప్రభుత్వం దళితులపై హింస కుల ప్రాతిపదికపై జరగడం లేదనే తన అభిప్రాయం రీత్యా ఈ చట్టం కింద కేసులు నమోదు చేసేది కాదు.

ఎస్సీ, ఎస్టీ చట్టంలో ఉండడానికైతే కొన్ని దళిత, ఆదివాసీ అనుకూల ప్రొవిజన్స్ వున్నాయి. ఈ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో, దళితులపై ఆదివాసులపై అత్యాచారాలను నిరోధించడంలో నిర్లక్ష్యం వహించిన దళితేతర, ఆదివాసేతర పోలీసు, ప్రభుత్వ అధికారులకు ఆరు నెలల నుండి ఒక సంవత్సరం వరకూ జైలు శిక్ష విధించే ఏర్పాటు ఈ చట్టంలోని సెక్షన్–4లో వుంది. నేరం చేస్తారనే అనుమానాలున్న వ్యక్తులను షెడ్యూల్డ్, ఆదివాసీ ప్రాంతాల నుండి బహిష్కరించే అధికారాన్ని ప్రత్యేక న్యాయస్థానాలకు ఈ చట్టం కల్పిస్తుంది. నేరస్తుల ఆస్తిని జప్తు చేసుకొనే

ఏర్పాటు వుంది. నేరం చేస్తారని భావిస్తున్న వాళ్లకు ముందస్తు బెయిల్ ఇవ్వకుండా అడ్డుకునే ప్రొవిజన్ వుంది. పీడితులూ లేదా వాళ్ల చట్టబద్ధ వారసులకు నష్టపరిహారం ఇప్పించడం, దోషిపై సామూహిక జరిమానా విధించే ఏర్పాటు కూడా వుంది. ఇవన్నీ ఉన్నప్పటికీ నేరం వెనుక కులానికి సంబంధించిన ఉద్దేశం నిర్ధారణ కాలేదనే ఒకే ఒక దెబ్బతో న్యాయ వ్యవస్థ దోషిని ఈ చట్ట పరిధిలోకి తేవడానికి తిరస్కరించవచ్చు. ఈ విధంగా రాజ్య యంత్రాంగం ఈ చట్టాన్ని మృతప్రాయం చేసింది. ఖైర్లాంజి వంటి జగద్విదిత సంఘటనలో కులం పేరుతో తిట్టీ, కొట్టీ, బోట్మాంగే కుటుంబానికి చెందిన ఇద్దరు మహిళలతో సహా నలుగురిని దారుణంగా హత్య చేసిన విషయంలో, ముగ్గురు సాక్షులు స్పష్టమైన సాక్ష్యం చెప్పినప్పటికీ భండారా సెషన్స్ కోర్టు నేరస్తులను ఎస్సీ, ఎస్టీ చట్టం పరిధిలోకి తీసుకురావడానికి తిరస్కరించింది. ఈ కేసులో 47 మంది నేరస్తుల్లో కేవలం 11 మందికి వ్యతిరేకంగా విచారణ జరిపి కేవలం 8 మందికి శిక్ష విధించింది. హైకోర్టు, సుప్రీం కోర్టు వరకూ అప్పీళ్లు, విచారణ, తీర్పుల సుదీర్ఘ ప్రక్రియల తర్వాత వాస్తవంగా నేరస్తులకు శిక్ష పడుతుందా లేదా చెప్పడం ఇప్పుడు కష్టమే.

ఉత్తర ప్రదేశ్‌కు చెందిన దళిత బీజేపీ పార్లమెంట్ సభ్యుడు ఛోటేలాల్ ఖర్వార్ వ్యథ ఈ చట్టం అమలు తీరుతెన్నులకు సంబంధించిన అత్యుత్తమ ఉదాహరణ. ఇటీవల ప్రాణాంతక దాడికి గురైన ఛోటేలాల్ ఫిర్యాదుపై పోలీసు స్టేషన్లో ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి సీఐ నుండి ఎస్పీ వరకూ ఎవరూ తయారుగా లేరు. దీనిని బట్టి సాధారణ దళితుల, ఆదివాసుల ప్రయోజనార్థం ఈ చట్టం ఎంత మేరకు అమలవుతుందోననే వాస్తవాన్ని అంచనా వేయడం కష్టం కాదు.

దేశంలో దళితులపై జరుగుతున్న అత్యాచారాలను పైపైన పరిశీలిస్తే ఎస్సీ, ఎస్టీ చట్టం అమలులోని వాస్తవాలను సులువుగా అంచనా వేసుకోగలం. భారత ప్రభుత్వ హోం శాఖ విడుదల చేసిన 2016-17 వార్షిక రిపోర్టు ప్రకారం షెడ్యూల్డ్ కులాలపై అపరాధ సంఘటనలు 2011-15 మధ్య కాలంలో పెద్ద ఎత్తున పెరిగాయి. 2011లో 673 హత్యలు జరిగాయి. కాగా 2015లో 813 జరిగాయి. మహిళలపై 2011 లో జరిగిన 1557 అత్యాచార (బలాత్కార) సంఘటనలతో పోలిస్తే 2015లో 2541కి పెరిగాయి. అపహరణ సంఘటనలు 2011లో 612 కాగా 2015లో 849. గృహ దహనాలు 2011లో 169, 2015లో 209 వెలుగుచూశాయి. ఎస్సీ, ఎస్టీ (ప్రివెన్షన్ ఆఫ్ ఎట్రాసిటీస్) ఆక్ట్ కింద 2011లో 11342 కేసులు నమోదయితే 2015లో 6005 కేసులు నమోదయ్యాయి. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ చట్టం కింద పోలీసు స్టేషన్లలో నమోదయ్యే కేసుల్లో చాలా తగ్గుదల కనిపిస్తున్నది. షెడ్యూల్డ్ కులాలపై జరిగిన ఇతర నేరాలు 2012లో 14164 వుంటే 2015లో 27684 వున్నాయి. వీళ్లపై జరిగిన పలు రకాల దాడుల మొత్తం సంఖ్య 2011లో 33719. కాగా 2015లో ఇవి 45003కి పెరిగాయి. బీజేపీ అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు పెరిగాయన్నది స్పష్టం. ఇక్కడ గుర్తుపెట్టుకోవాల్సిన విషయం ఏంటంటే దళితులపై జరిగే అన్ని రకాల నేరాల్లో కులం అనేది ఒక ముఖ్యమైన విషయం. కానీ కోర్టులు దీనిని పట్టించుకోవు.

ఎస్సీ, ఎస్టీ చట్టం వున్నప్పటికీ దళితులూ, ఆదివాసులపై నిరంతరాయంగా జరుగుతున్న వేలాది, లక్షలాది అత్యాచారాలు గణాంకాలకు ఎక్కడమే లేదన్న విషయం తెల్సిందే. పాలక వర్గాలు, ఆధిపత్య కులాల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే రాజ్యయంత్రాంగం షెడ్యూల్డ్ కులాల, తెగలపై జరిగే వేలాది నేరాలను నమోదు చేయకుండానే వదిలేస్తుంది. పోలీసులు వీటిని నమోదు చేయడానికి తిరస్కరిస్తారు. నమోదైన కేసుల్లో చాలా మేరకు కోర్టుల్లో స్టే విధించబడో, తీర్పులు వెలువరించకుండానో పడి వుంటాయి. దేశవ్యాప్తంగా ఎస్సీ/ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద నమోదైన కేసుల్లో దాదాపు 2 శాతం మాత్రమే శిక్షలు పడుతున్నాయి. వీటిలో 95 శాతం కేసులు కేవలం పోలీసుల ఘోర నిర్లక్ష్యం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సంపూర్ణ ప్రతికూల వైఖరి కారణంగా తిరస్కరించబడుతాయి. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం అమలులో నిర్లక్ష్యం వహించే పోలీసు, ప్రభుత్వ అధికారులపై ఈ చట్టంలోని సెక్షన్-4 ప్రకారం చర్యలు తీసుకునే బదులు ప్రభుత్వాలు వీరికి ప్రమోషన్లు ఇస్తాయి.

ఒకవైపు అగ్ర కుల, హిందూ మతోన్మాదుల ద్వారా ప్రతి ఏటా దళితులూ, ఆదివాసులూ, ముస్లింలూ, విప్లవకారులపై జరుగుతున్న నేరాల్లో అరెస్టవుతున్న వారి సంఖ్య చాలా తక్కువ. వీళ్లందరినీ దాదాపు ఏ శిక్షలూ వేయకుండానే వదిలేస్తారు. మరోవైపు దళితులూ, ఆదివాసులూ, ముస్లింలూ, విప్లవకారులను చాలా మేరకు చిన్న చిన్న నేరాల్లో సైతం పెద్ద ఎత్తున జైళ్లల్లో కుక్కుతారు. కఠిన శిక్షలు వేస్తారు. నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో సర్వే, ప్రిజన్ స్టాటటిక్స్ ఇండియా 2013 ప్రకారం దేశంలోని జైళ్లలో మగ్గుతున్న ఖైదీల్లో 53 శాతం దళితులూ, ఆదివాసులూ, ముస్లింలే వున్నారు. నిరంతరం చైతన్యవంతమవుతున్న దళితులను అణచివేయడం కోసం అగ్ర కులాల భూస్వామ్య, దుష్ట పెత్తందారు శక్తులు వాళ్లపై సామూహిక అత్యాచారాలకు పాల్పడుతున్నారు. వాళ్ల ఇండ్లను ధ్వంసం చేస్తున్నారు. వాళ్లపై సామూహిక హత్యాకాండలకు పాల్పడుతున్నారు. దేశంలో సంచలనం సృష్టించిన కిల్వెన్మణి, బథానీటోలా, లక్ష్మణ్‌పూర్ బాథే, శంకర్‌బిగాహ, కారంచేడు, చుండూరు, వేంపెంట, కంబాలపల్లి వంటి ఘోర, అమానవీయ హత్యాకాండల కుఖ్యాత కేసుల్లో అగ్ర కులాల, అగ్ర వర్గాలకు చెందిన దోషులందరినీ నిర్దోషులుగా ప్రకటిస్తూ కోర్టులు నిస్సిగ్గుగా తీర్పులు చెప్పాయి. ఇవన్నీ పోలీసు, న్యాయ వ్యవస్థల అగ్ర కుల, అగ్ర వర్గ పక్షపాత వైఖరిని స్పష్టంగా బహిర్గతం చేస్తున్నాయి.

ఒకవైపు మోదీ, ఆయన ప్రభుత్వం డా. భీమ్‌రావ్ అండేడ్కర్‌ను పొగడడం జరుగుతున్నది. మరోవైపు ఆయన విగ్రహాలను కూలగొట్టిన వాళ్లనూ; దళితులూ, ఆదివాసులూ, మత మైనారిటీలపై దాడులు చేసి, వాళ్లను హత్యచేసిన వాళ్లనూ; వాళ్ల సంస్కృతి, జీవనశైలిని అవమానించే వాళ్లను కాపాడుతూ, మద్దతు ఇస్తున్నారు. మోదీ తాను ప్రకటించిన నయా భారత్‌ను నిర్మించడానికి పూనుకున్నాడు. వాస్తవానికి నయా భారత్ అంటే బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు భారత్ తప్ప మరేం కాదు. అది విభిన్న జాతుల, మతాల అస్తిత్వాన్నీ, గుర్తింపునూ రూపుమాపి, దేశ, విదేశ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను, అగ్రకులాల ఆధిపత్యాన్ని నిలబెట్టే అఖండ హిందూ రాజ్యం. కనుక ఈ లక్ష్యంతో పని చేసే హిందూ మతోన్మాద సంఘ్ శక్తులు నేడు రాజ్యాంగాన్ని మార్చాలనీ, రిజర్వేషన్లను అంతం చేయాలని ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నారు.

ఈ పరిస్థితిలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం, 1989ను బలహీనపరిచే రాజ్య యంత్రాంగపు అన్ని రకాల ప్రయత్నాలకు వ్యతిరేకంగానూ, దీనిని దృఢంగా అమలు చేయించడం కోసమూ గళం విప్పాలనీ, ప్రదర్శనలు జరపాలనీ, సమరశీల ఆందోళనలు చేపట్టాలనీ, హిందుత్వ మతోన్మాద శక్తుల దాడులను తిప్పికొడుతూ సాయుధ ప్రతిఘటనను పెంపొందించాలనీ, భీమా-కోరేగావ్ సంఘటనలో వలె ఉద్యమంపై నీళ్లు చల్లే అవకాశవాద నాయకులూ, తదితరుల పట్ల అప్రమత్తంగా వుండాలనీ, కేవలం చట్టబద్ధమైన, రాజ్యాంగ హక్కుల వరకే పరిమితం కాకుండా దళితుల నిజమైన, సంపూర్ణ విముక్తి కోసం ప్రస్తుత భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద కూటమికి చెందిన రాజ్యాధికారాన్ని

పెకిలించివేసి కార్మిక వర్గ నేతృత్వంలో రైతాంగం, పెటీ బూర్జువా, జాతీయ బూర్జువా వర్గాల ఐక్య సంఘటన కూడిన ప్రజల ప్రజాస్వామిక రాజ్యాధికారాన్ని నిర్మించడం కొరకు నడుం కట్టాలనీ, వర్తమాన అర్ధ వలస, అర్ధ భూస్వామ్య సామాజిక, ఆర్థిక వ్యవస్థ స్థానంలో నూతన ప్రజాస్వామిక, సోషలిస్టు భారతాన్ని నిర్మించే దిశగా ప్రజా యుద్ధంలో ముందుకు సాగాలని దళితులూ, ఆదివాసులందరికీ మా పార్టీ విజ్ఞప్తి చేస్తున్నది.

మోదీ ప్రభుత్వం ప్రజా, దళిత, ఆదివాసీ, మత మైనారిటీ, వెనుకబడిన వర్గాల, మహిళా వ్యతిరేకమైనది. దేశద్రోహకరమైనది. కనుక మా పార్టీ పీడిత వర్గాలూ, సెక్షన్ల ప్రజలందరికీ, ప్రగతిశీల, ప్రజాస్వామిక, దేశభక్త శక్తులకూ, మానవ హక్కుల సంఘాలకూ, వ్యక్తులకూ, వామపక్ష శక్తులకూ బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికీ, వాళ్ల నయా భారత్‌కు వ్యతిరేకంగా విశాల, సంఘటిత, సమరశీల ఐక్య సంఘటనను నిర్మించే దిశగా అడుగులు వేయమని విజ్ఞప్తి చేస్తున్నది.

Abhay

**(అభయ్ )**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**